



# చెక్కబొమ్మలు

ఎలక్ట్రాన్

**ఎవరి వెర్రి వారికానందం అనే నానుడిలో ఎంతటి వాస్తవముందో, ఒకరి వెర్రి మరొకరికి బ్రతుకుతెరువూ చూపిస్తుంది, మారణహోమాలూ సృష్టి స్తుంది అన్న దాంట్లోనూ అంతే వాస్త వముంది.** ధన, అధికార దాహార్తులూ, భోగ లాలసులూ, భోజనప్రియులూ, భక్తిమార్గులూ, పర్యాటకా సక్తులూ, క్రీడాభిమానులూ, కీర్తి పతాక కాముకులైన కళాకారులూ ఇత్యాది తమకు తెలిసో, తెలియకో సమాజంలో ఎంతో మందికి జీవనభృతి కలిగిస్తూనే ఉంటారు. సమాజ స్వరూపం మీద అంతో, ఇంతో ప్రభా వాన్ని కలిగిస్తూనే ఉంటారు.

అయితే చెంచాగిరి అనే వెర్రితనానికి లోనైనవారు తమ పైవారికి మరిన్ని కీర్తి, ప్రతిష్ఠలనార్జించి పెడతారేమో కానీ, తమతమ జీవితాలేదిశగా పయనిస్తున్నాయో గుర్తించరు. కార్యాలయాల్లో కాకాపడితే కాసిన్ని మెట్లెక్క వచ్చునేమో కానీ, నిజ జీవితంలో అర్థం పర్థం లేని వెర్రి అభిమానాలు పెంచుకొంటే ఏం ఒరుగుతుందీ అంటే చెప్పడం చాలా కష్టం. అది ఆయా అభిమానులకే తెలియాలి.

మండల కేంద్రమైన నగరం నడిబొడ్డులో ఒక పార్కు, పార్కు ఉనికిని సూచిస్తూ చుట్టూరా ముళ్ళ తీగల కంచె తప్పించి, పార్కు లోపల మచ్చుకైనా ఒక చెట్టు కనిపించదు. శిథిలా వస్థలో అక్కడక్కడా చెల్లాచెదురుగా ఉన్న సిమెం టు బెంచీలు, మురికి గుంటలూ, ఎర్రమట్టీ, పిచ్చి గడ్డీ ఉద్యానవనమనేదానికి కొత్త నిర్వచ నాన్నిస్తున్నాయి. అయితే అక్కడ నీడనేది లేదను కొంటే పొరపాటే అవుతుంది. ఆ పార్కుకి పడ మరనున్న ముఖ్య వీధిలో కంచె పక్కన ఇద్దరి ప్రసిద్ధ చలనచిత్ర నాయకుల కటౌట్లు నిలబెట్ట బడి ఉన్నాయి. అవి సాయం సమయాల్లో పుష్క లంగా పార్కులోకి నీడల్ని నింపుతాయి. ఏ నటుడి అభిమానులు ఆ నటుడి కటౌట్ ఛాయలో ఉన్న సిమెంటు బెంచీల మీద కూర్చుని కబుర్లాడుకొంటారు. తన్మయత్వంలో వాస్తవాన్ని విస్మరిస్తారు.

అలాంటి ఓ సాయంత్రం –

"ఎవరు నువ్వు, మా నాయకుడి నీడలో కూర్చున్నావు? లేచి బెంచీ ఖాళీ చెయ్యి" అన్నాడు కనకారావు, బెంచీ మీద కూర్చున్న వ్యక్తిని చూసి.

"నా పేరు నారాయణ. ఈ నీడ తాలూకు నాయకుడి బొమ్మ చిత్రించి, చెక్కి కటౌట్ చేసిన పెయింటర్ నాగరాజుగారబ్బాయిని. మీరింకా వెయ్యి రూపాయలు బాకీ ఉన్నారట, అడిగి తీసుకు రమ్మన్నారు" అన్నాడా బెంచీ మీద కూర్చున్న యువకుడు.

"హైదరాబాదులో చదువుకొంటున్న నాగ రాజుగారబ్బాయి మీరేనా? జిల్లా అభిమాన సంఘం నుంచి ఇంకా డబ్బు అందలేదు. అందగానే స్వయంగా నేనే వచ్చి సొమ్మందజేస్తా నని చెప్పండి." అన్నాడు కనకారావు సంబోధ నలో కాస్త గౌరవాన్ని చొప్పిస్తూ. వచ్చిన డబ్బుతో సరదాలెప్పుడో చేసేసుకొంది కనకా రావు బృందం. ఇప్పుడు నారాయణనెలానో బుజ్జగించి వీలైనంతగా వాయిదా వెయ్యాలన్న ఉద్దేశంతో ఉన్నాడు కనకారావు.

"జిల్లా సంఘం నుంచి డబ్బు వచ్చిందని ఎవరో చెప్పడం మూలానే, మీరిక్కడుంటారనీ,

సొమ్ము వసూలు చేసుకు రమ్మనీ మా నాన్నగారు పంపించారు. నేను కాలేజీ ఫీజులూ అవీ కట్టాలి" అన్నాడు నారాయణ.

"ఎవరో తప్పుడు సమాచారం చెప్పి ఉంటారు. రాగానే మొహాన పడవేస్తాను అని చెప్పు" కనకారావు పక్కనే నిల్చున్న శివ నోరు జారాడు. మరో పక్కన నిల్చున్న వీర్రాజు వెకిలిగా నవ్వాడు.

కనకారావుకి తన అనుచరులిద్దరి మీదా ఒళ్ళు మండింది. లౌక్యం తెలియని మనుషులంటూ మనసులో తిట్టుకున్నాడు. కనకారావు నారాయణ పక్కగా కూర్చుంటూ "వాళ్ళ మాటలు పట్టించుకోకండి. సినిమా బాగా ఆడుతోంది. కలెక్షన్లు జోరుగా ఉన్నాయి. జిల్లా సంఘం నుంచి సొమ్ము రాక ముందే మా కలెక్షన్లతో బాకీ తీర్చేస్తాం. ఇంతకీ మీరు సినిమా చూశారా? టిక్కెటు కావాలంటే చెప్పండి. ఈ రాత్రి రెండో ఆటకి ఏర్పాటు చేస్తాను" అన్నాడు డేమేజ్ కంట్రోల్ చెయ్యడానికి ప్రయత్నిస్తూ.

"ఆ అవసరం లేదు. సినిమాని మొన్ననే హైదరాబాద్‌లో చూశాను" అన్నాడు నారాయణ.

"ఎలా ఉంది సినిమా, చాలా బావుంది కదూ?"

నారాయణకి వీళ్ళకా కలెక్షన్లూ అవీ ఎలా వస్తాయో తెలుసు. ఆ ఊసెత్తకుండా సినిమా గురించి తన అభిప్రాయం చెప్పాడు. "ఫోటోగ్రఫీ బావుంది. డిజిటల్ సౌండ్‌తో చెవులకి పట్టిన తుప్పు వదిలిపోయింది. ఆలమూరు జంటని న్యూజిలాండ్‌లోనూ, చింతలూరు జంటని స్విట్జర్లాండ్‌లోనూ నడిరోడ్ల మీద డాన్సులు చేస్తున్నట్లు చూపించడం మట్టుకు ప్రేక్షకుల్ని వెర్రివాళ్ళగా పరిగణించడమే!"

"ఏదో కాస్త పట్నం చదువనే సరికి కళాఖండాలు తప్పించి ఈ పోజురాయుళ్ళు మసాలా సినిమాలు నచ్చనట్లు అద్భుతంగా నటిస్తారు. వీరు నటీనటుల ప్రతిభని గమనించరు. కథలో ఉన్న బలాన్ని గుర్తించరు. ఈ సినిమాలో మా అభిమాన హీరో ఎంత అద్భుతంగా నటించాడని? నటనకి నిర్వచనం తెలియనివాళ్ళు సినిమాలు చూస్తే ఇలానే ఉంటుంది" వీర్రాజు వెటకారంగా అన్నాడు.

"ఆ మాట మీలాంటి వాళ్ళని గురించి నేననవలసినది. నాయికతోసహా సహనటుల నందర్నీ ఓ చిన్న గీత మీద నిలబెట్టి, ఆమెను సెక్సు బొమ్మగానూ, మిగిలినవారిని ఎమోషనల్ సెంటీస్‌గానూ చూపించి తక్కువ చేస్తారు. చిత్రం పొడువునా తన్నులు తినే రౌడీలనీ, విలన్లనీ నిలబెట్టి నాయకుణ్ణి పెద్ద గీత మీద ప్రొజెక్ట్ చేస్తున్నారు. ఉన్నత శిఖరాల మీద నిలబెడ్తున్నారు" నారాయణ చిన్న క్లాసు పీకి పెద్ద తప్పే చేశాడు.

కనకారావుకి ఒక్క క్షణం మతి స్థిమితం అదుపు తప్పింది. నారాయణ కాలరు పట్టుకొని, "అంటే మా అభిమాన హీరో కిరీటిని నువ్వు అవమానిస్తున్నట్లే లెఖ్ఖ. క్షమార్పణలు చెప్పు" అని గట్టిగా అరిచాడు.

"ఎందుకు క్షమార్పణలు చెప్పాలి? ఉన్నమాటే అన్నాను. మరోమారు అంటాను కూడా. ఈ కాలపు సినిమాలని నడిపించేవి గొంతు చించుకొనే అరుపులూ, గుద్దులాటలూ, ముద్దులాటలూ, ద్వంద్వార్థపు కామెడీ ట్రాక్‌లూ తప్ప మరోటి కావు. నటన అనేదానికి నిర్వచనం ఏనాడో మారిపోయింది. దానికి తోడు ప్రేక్షకుల అభిరుచులూ మారిపోయాయి" అన్నాడు నారాయణ కనకారావు చెయ్యిని బలంగా విదిలించుకుంటూ.

"అంటే అక్కడికి నీ టేస్టేదో గొప్పదన్నటుగానూ, మేమంతా వెర్రిపీనుగుల మన్నటుగానూ మాట్లాడుతున్నావ్" కనకారావు బెంచీ మీద నుంచి లేచి, నారాయణ మీదకు వంగుతూ అన్నాడు. వీర్రాజు కనకారావుని వెనక్కిలాగాడు.

"మరి అటువంటి సినిమా ఎందుకు చూసినట్టు? శివా ఎగతాళిగా అన్నాడు.

"కేవలం కాలక్షేపం కోసం చూశాను. కాలక్షేపం బాగానే జరిగింది. ఎందుకంటే దర్శకుడు అన్ని హంగులతోటీ ప్రేక్షకులకి ఐస్‌క్రీం పెట్టాడు. అంతకు మించి ఆ సినిమాలో ఏమీ లేదు. అయితే నాయకుడి మెడలో పడవని తెలిసీ తెరమీదకు పూలమాలల్ని విసిరే అభిమానులను వెర్రివాళ్ళనక ఏమనాలి?"


"మంచి మాటా, ఉన్న మాటా అన్నావు" అన్నాడు, అంతవరకూ ఎదురుగా కాస్త పక్కగా

## కోరిక




వేదాంతం
మాట్లాడితే
మరీ చేతకానివాణ్ణి
అంటున్నారు
సాహిత్యం
మాట్లాడితే మరీ
పండితుడివా అన్నారు
అమాయకత్వంగా పిలిస్తే
హేళన చేసింది
నిజాయితీగా మాట్లాడితే
స్వార్థం అంది
అందుకే నా నోరు
ఏ విధంగా
పలుకరించకుండా
మూగవాడిగా
పుడితే బాగుండును
అనిపిస్తోంది.

– డి. చందువంశీ



## ఫెంగ్ షుయ్ - లాభాలు



ప్రపంచంలోని అన్నిదేశాలలో ప్రతి సంస్కృతిలోనూ మహర్షులు, మహాత్ములు మానవ జీవితం సుఖసంతోషాలతో ఆనందమయంగా అర్థవంతంగా సాగడానికి చక్కని ఉపాయాలు, అనేక సాంప్రదాయాలు సూచించారు. వాటిని సోదాహరణాలతో సేకరించి మీ ముందుంచడానికి ఈ ప్రయత్నం. ఆయా విషయాలు మాకున్న అనుభవంతో మంచి ఫలితాలిస్తున్నవి.

## ధనాకర్షణ - బుద్ధదేవుడు

బౌద్ధమతాచార్యులు ఫెంగ్ షుయ్ (FENG SHUI) పద్ధతిని చాలా శతాబ్దాలుగా చైనాలోను, ఆగ్నేయాసియా దేశాలలోను విస్తృతంగా ఆచరణలో పెట్టారు. ఈ పద్ధతి అమెరికాలోను, ఇంగ్లాండు లోను కూడా చాలా పాపులర్ అయింది.

మన హైదరాబాదు మహానగరంలోని ఖైరతాబాదు ఆర్.టి.ఎ. ఆఫీసు నుంచి ఇ-సేవా కేంద్రానికి వెళ్ళే దారిలో ఒక లాఫింగ్ బుద్ధ విగ్రహం ఉన్నది. అలాగే సాలార్‌జంగ్ మ్యూజియంలో కూడా లాఫింగ్ బుద్ధ విగ్రహాలున్నవి. బుద్ధదేవుడు బొజ్జదేవర, కడుపుబ్బ నవ్వుతూ, మనల్ని ఆశీర్వదిస్తూ సర్కారువారికి ధనాకర్షణ చేస్తున్నట్లు కనిపిస్తుంది. ఫెంగ్ షుయ్ పద్ధతిలో బుద్ధదేవుడు ఉన్న చోట ధనాకర్షణ ఉంటుందని వారు రాశారు. ఈ విషయాన్ని ప్రత్యక్షంగా అమెరికాలో చూశాం. మీ ఇంటిలోగానీ, దుకాణంలోగానీ లాఫింగ్ బుద్ధ ప్రతిమను ఉంచి పూజించండి. లివింగ్ రూమ్‌లో కొంచెం ఎత్తైనచోట దేవుని విగ్రహం, ఆయన దృష్టి సింహద్వారాన్ని చూసేట్టుగా 27 అంగుళాలు లేదా 36 అంగుళాలు ఎత్తుగా పెట్టండి. రోజూ దీపాన్నిగానీ, అగరువత్తినిగానీ పెట్టండి. దుకాణంలోగాని, ఆఫీసుగానీ ముఖద్వారాన్ని చూసేటట్లుగా పెట్టండి. ఎదురుగా గానీ, కోణంలో గానీ ఉంచవచ్చును. రోజు పూజ చేయండి.

ఈ విషయంలో ఇంకొక పద్ధతి కూడా మా దృష్టికి వచ్చింది. ఇంటి సింహద్వారం పైన లోపలివైపు పద్మాసనం వేసుకుని తామరపువ్వులో కూర్చుని ఉన్న శ్రీమహాలక్ష్మి ఫొటోను, సింహద్వారానికి ఎదురుగా గోడపై శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఫోటోను పెట్టుకున్న ఇంట్లో సుఖసంపదలు ఉంటాయని చెబుతున్నారు. **- ఎ. పార్థసారధి, రామకృష్ణ**

---

రెండో హీరో కటౌట్ నీడలో బెంచీ మీద ఇద్దరి మధ్య కూర్చుని వీళ్ళ వాగ్వివాదాన్ని వింటున్న ఆంజనేయులు.

"మా మాటల్లో జోక్యం చేసుకోవడానికి నువ్వెవరు?" కనకారావు అటువైపు అడుగు వేస్తూ అన్నాడు.

"నేనెవరినో, ఏ నీడలో కూర్చున్నానో తెలియకనే అడుగుతున్నావా? నవయువ నటకిశోర గాండీవ్ అభిమాన సంఘ ప్రెసిడెంట్ అంజనేయుల్ని. నీకు తెలియదేమో కానీ, నారాయణ ఈ రోజున రిలీజైన మా హీరో సినిమా పదకొండో గంట ఆట చూశాడు. నారాయణ నడుగు మా హీరో సినిమా బావుందో, మీ హీరో సినిమా బావుందో చెప్తాడు" అన్నాడు ఆంజనేయులు.

కనకారావు మళ్ళీ నారాయణ వైపు తిరిగాడు. "నిజమేనా?" చాలా తీవ్రంగా అడిగాడు.

"నిజమే. నా డబ్బుతో నా ఇష్టం వచ్చిన సినిమా చూస్తాను. అడగడానికి మీరెవరు?" నారాయణ కాస్త హెచ్చు స్వరంతోనే అన్నాడు.

"ఎవర్నా? నటశేఖర కిరీటి అభిమాన సంఘ సెక్రటరీని. ఎందుకు చూశావని నిన్నడగటల్లేదు. కానీ ఏ సినిమా బావుందో చెప్పి తీరాల్సిందే"

"ఆ సినిమా కూడా అవకతవకలతో కాలక్షేపంగానే వుంది. సాంకేతిక విలువలతో బ్రహ్మాండంగా ఉంది. ఎటొచ్చీ మీ హీరో పిడికిలి బిగిస్తే కండరాలు పచ్చడవుతాయి. అంజనేయులు గారి హీరో వేలెత్తితే మెద నరాలు తెగుతాయి, అంతే తేడా!" అన్నాడు నారాయణ.

"మరీ అంత చులకనగా మాట్లాడకు. కుడిచేతి జబ్బలో బుల్లెట్ గాయం అయి కూడా ఎడమచేతి చూపుడు వేలితో ఎనమండుగుర్ని మట్టి కరిపించాడు మా గాండీవ్" అన్నాడు ఆంజనేయులు బెంచీ మీద నుంచి లేస్తూ.

"కుడి చేతిలో ఆరేళ్ళ పాపనెత్తుకొని ఎడమ చేతి ముష్టి ఘాతాలతో పదిమందిని పరుగులు తీయించాడు మా కిరీటి" అన్నాడు కనకారావు.

"తెరమీద పడేది వాస్తవ బింబమైనా, అందులోని అవాస్తవ సంఘటల్ని అర్థం చేసుకోలేని ప్రేక్షకులున్నంతకాలం నిర్మాతలూ, దర్శకులూ ఏమైనా తీస్తారు. తోచనప్పుడు ఏదో కాలక్షేపానికి సినిమా చూడాలంటే చూడాలి కాని, అంతకు మించిన జోక్యం అనవసరమనుకునే నారాయణకి ఆ ప్రత్యర్థుల మాటలు నవ్వు తెప్పించాయి.

"నవ్వులాటలుగా ఉందా? దుర్మార్గుడైన మంత్రివరేణ్యుణ్ణి సైతం ఖాతరు చెయ్యకుండా, అతన్ని రోడ్డుకీడ్చి జయం సాధించాడు గాండీవ్" అన్నాడు ఆంజనేయులి అనుచరుడు అప్పారావు.

"అవినీతిపరుడైన పోలీసాఫీసర్ని ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించాడు కిరీటి" వీర్రాజు గొంతు విప్పాడు.

"విగ్రహాల్ని చోరీ చేసి విదేశాల్లో అమ్మే స్మగ్లర్లకీ, మాదక ద్రవ్యాలతో యువత భవిష్యత్తు నాశనం చేసే దుర్మార్గులకీ మా నాయకుడు గాండీవ్ బుద్ధి చెప్పాడు" అంటూ ఆంజనేయులి మరో అనుచరుడు నవీన్ ముందుకురికాడు.

పోను పోను తీవ్రస్థాయినందుకున్న ఈ వాగ్యుద్ధం పార్కులో అక్కడక్కడా కూర్చున్న జనాన్ని పోగుచేసింది. అరిచేవాళ్ళు కొంద్దరు, ఆజ్యం పోసేవాళ్ళు కొందరు.

"డబ్బు కక్కుర్తితో నాసిరకం పనులు చేసే కాంట్రాక్టర్లకీ, చేయించే ఇంజనీర్లకీ సంకెళ్ళు వేయించాడు కిరీటి" అన్నాడు శివా.

"కార్పొరేట్ హాస్పిటళ్ళలో జరిగే అమానుష వైద్యరీతుల్ని ఎండగట్టి, వైద్యులకి గడ్డిపెట్టాడు గాండీవ్" జనంలోంచి ఎవరో అన్నారు.

"అన్ని ప్రభుత్వ ఆఫీసుల్లోనూ కేన్సర్‌లా వ్యాపించిన అవినీతిని ఎలుగెత్తి చాటాడు కిరీటి" అని ఎవరో అన్నారు.

పోగైన జనాలుగుంపులుగా విడిపోయారు. రోడ్డు మీది జనాలు లోపల ప్రవేశించి కొద్దిపాటి సమాచారం తెలుసుకొని ఆ గుంపుల్లో అటూ, ఇటూ కలిసిపోయారు.

"కొంతమూరు వదిలి కోయంబత్తూరు దొంగనోట్ల పంపిణీదారుల పని పట్టించాడు గాండీవ్" ఒక గుంపు అరిచింది.

"ముక్తేశ్వరం నుంచి ముంబాయ్ వెళ్ళి అక్కడ అధోజగత్ నాయకుల ఆట కట్టించాడు కిరీటి" మరో గుంపు ఎలుగెత్తింది.

ఉద్రిక్తత తారకస్థాయికి ఎదిగిందని గుర్తించినా, నారాయణ నోరు జారాడు "ఓ

జట్టువాళ్ళు ఎడమచేతి పిడికిలితోనూ, మరో జట్టువాళ్ళు ఎడమచేతి చూపుడు వేలుతోనూ కలబడండి. ఎవరు నెగ్గితే వాళ్ళ నాయకుడు గొప్ప."

రెండు గుంపులకీ నసాళం అంటింది. ముందస్తుగా రెండు గుంపులూ కలసి నారాయణని వేళ్లతోటీ, గుద్దులతోటీ కుళ్ళబొడిచారు. తర్వాత ఒకళ్ళ మీద ఒకళ్ళు కలియబడ్డారు. కొంతమంది పార్కు బయటకు పరుగెత్తి, ఒకరి అభిమాన హీరో కటౌట్‌ను మరొకరు ముక్కలు చేసి ముట్టించారు. రెండు కటౌట్లు కాలి బూడిదయ్యాయి. ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఆనవాయితీగా పోలీసులు ఆలస్యంగా రంగంలోకి దూకారు. భాష్పవాయు ప్రయోగం, లాఠీఛార్జిలూ జరిగాయి. ఆ ప్రయత్నంలో పలువురు గాయపడ్డారు.

అటో ఆరుగుర్నీ, ఇటో ఆరుగుర్ని పోలీసులు లాకప్‌లో పెట్టారు. వారిలో కనకారావు లేడు, ఆంజనేయులు లేడు. వళ్ళంతా దెబ్బలతో వాచిన పెదాలతో, చిరిగిన చొక్కాతో ఉన్న నారాయణని కూడా పోలీసులు కష్టడీలోకి తీసుకున్నారు.

"ఉన్న మాటంటే ఉలుకెక్కువ. హాలు యాజమాన్యంతో కుమ్మక్కయి బ్లాక్‌లో టిక్కెట్లమ్మే వ్యక్తులు తమకు టోపీలు తొడుగుతున్నారని ఈ వీరాభిమానులు గుర్తించరు. బ్లాక్‌లో టిక్కెట్లు అమ్మేవారి సంగతటుంచి, బ్లాక్‌లో టిక్కెట్లు కొనుక్కొని సినిమా చూసి, అన్యాయాల్నీ, అవినీతి పనుల్నీ ఎదిరించే నాయకుడి పాత్ర ధరించిన నటుణ్ణి ఆకాశానికి ఎత్తివేయడం కంటే మరో ఆత్మవంచన ఉండబోదు" అన్నాడు నారాయణ పోలీసు జీపు వెనక సీట్లో కూర్చుంటూ, చిరిగిన చొక్కాని విప్పి పారేస్తూ.

"అలానే ఎందుకనుకోవాలి? వీరాభిమానుల ముసుగులు వేసుకొని టిక్కెట్లను నొక్కిపట్టి బ్లాక్ చేసేవాళ్ళు కూడా చాలామందే ఉండుంటారు. సినిమా రేటింగ్‌కి ఈ బ్లాక్ మార్కెట్ కూడా ఓ ప్రచార సాధనమే మరి" అన్నాడో తల నెరిసిన కానిస్టేబుల్ నారాయణ మీద సానుభూతి చూపిస్తూ.

ఆ జనాల్లో తొమ్మిదో తరగతి రెండో సంవత్సరం చదివే రాహుల్ అనే కుర్రవాడున్నాడు. తండ్రి జేబులోంచి వంద రూపాయల నోటు కాజేసి, క్లాసు ఎగ్గొట్టి రెండో రోజు ఉదయం పదకొండు గంటలాటకి బ్లాక్‌లో టిక్కెట్లు కొనుక్కుని నటశేఖర కిరీటి నటించిన పులిబిడ్డ సినిమా చూశాడు. పొగాకు తోటల్లో రోజు కూలీ చేసి సంసారాన్ని లాక్కొస్తున్న రాజమ్మ కొడుకు అప్పారావు. తల్లిని వేధించి ఏభై రూపాయలు తీసుకుపోయి మొదటిరోజు మ్యాటనీ షోలో నవయువ నటకిశోర గాండీవ్ సినిమా కోనసీమ కొదమసింహం బ్లాక్‌లో టిక్కెట్లు కొని చూశాడు. మొదటిసారి హీరో తెరమీద కనబడ్డప్పుడు పువ్వులు విసిరాడు. తల్లి దండ్రుల కష్టార్జితం విలువ ఆ కుర్రవాళ్ళకు తెలియలేదు.

క్రితం రోజు సాయంత్రం ఆటోకి ముప్ఫై రూపాయలిచ్చి గంటన్నర ముందుగా హాలు చేరిన సాంబశివరావు దంపతులు, కౌంటర్ క్లర్క్ రెండు టిక్కెట్లమ్మి హౌస్ ఫుల్ బోర్డు వెలిగించడంతో హతాశులై, మళ్ళీ ఇంకోసారి వస్తే రానూ, పోనూ దారి ఖర్చులెంతవుతాయో బేరీజు వేసుకొని పాతికా ఏభై అని అరిచేవాడి దగ్గరకు దారితీశారు. ఈ రోజున పార్కువద్ద జరిగిన గొడవని చూసిన జనాల్లో సాంబశివం కూడా ఒకడు. తెరమీద నాయకుడు అవినీతిపై, అన్యాయాలపై దాడి చేస్తోంటే చాలా మంది ప్రేక్షకులలాగానే ఉత్తేజితులైపోయారే కానీ బ్లాక్‌లో టిక్కెట్లు కొని మొదటి రోజే సినిమా చూశామన్న సంతృప్తే తప్ప, తామెంత అవినీతిని ప్రోత్సహించారోనన్న ఆలోచన ఆ దంపతులకు రాలేదు.

నారాయణ చెప్పిందంతా శ్రద్ధగా విన్న స్టేషనాఫీసరు అందర్నీ **గట్టిగా మందలించి,** అవసరమొచ్చినప్పుడల్లా హాజరవుతామన్న హామీ పత్రాన్ని తీసుకొని, ఆ మర్నాడు ఉదయం అందర్నీ విడుదల చేశాడు. ఆ చలనచిత్ర నాయకుల రాజకీయదళారుల్నుంచి ఆ స్టేషనాఫీసర్‌కి రెండు ఫోనుకాల్స్ వచ్చాయన్నది వేరే విషయం.

బాకీ సొమ్ముని వసూలు చేసుకొని రమ్మని మాట లౌక్యం లేని కొడుకుని పంపించినందుకు నాగరాజూ, అడిగి రమ్మంటే అభిమాన సంఘ సింహాల నోళ్ళలో తలపెట్టి, తదనంతర ఉదంతానికీ, పర్యవసానానికీ తానెంత బాధ్యుడూ అని నారాయణా చింతిస్తూనే ఉన్నారు. ఎందుకంటే –

ఇటువంటి గొడవలకీ, డ్రైవర్ల దృష్టి మరలి జరిగే వాహన ప్రమాదాలకీ ఈ కటౌట్లే కారణమంటూ ప్రభుత్వ నిషేధాజ్ఞల్ని జారీ చేసింది. కొంచెం పెద్ద మొత్తంలో సొమ్ము కూడా చేసుకోగల కటౌట్ వ్యాపారం దెబ్బ తినడంతో ఆ కళాకారుల జీవితాలిప్పుడు పూర్తిగా బేనర్ బతుకులైపోయాయి.

నగర సందర్శనార్థం వచ్చే ప్రముఖుల నిమిత్తం స్వాగత ద్వార పతాకలు పెళ్ళివారు పయనించే బస్సుల మీద ఆడంబర ప్రదర్శన పతాకలు, కల్యాణ మంటపాల దగ్గర ఆహ్వాన ద్వారపతాకలు, స్వంత ఖర్చుతో పుస్తకావిష్కరణ సభలు, సన్మాన సభలు కొత్త సినిమా విడుదలైనప్పుడల్లా హాలు ఆవరణలో అభిమాన సంఘాల శుభాకాంక్షలు ప్రదర్శించే శిల్కు పతాకలు ఇలాంటి ధ్యాసలు ప్రజల్లో లేకపోతే నాగరాజులాంటివాళ్ళ ఎన్నో కుటుంబాలు రోడ్డున పడవూ? ❋

## ఏది చేసినా సంచలనమే!

'సూర్యం' హీరోయిన్ సెలీనాజైట్లీ మొదటి నుంచీ ప్రియుల వేటలో సంచలనాలే చేస్తూ వచ్చింది. ఇప్పుడు అమ్మడి గురించి బాలీవుడ్‌లో ఓ గరమ్ వార్త వినిపిస్తోంది. ఇటీవల తన పుట్టిన రోజు నాడు ముంబాయిలోని ఓ రెస్టారెంట్‌లో ఓ విదేశీ వ్యక్తితో డిన్నర్ చేస్తూ కనిపించిందట. ఆ వ్యక్తి ఎవరా అని ఆరా తీస్తే ఆ రెస్టారెంట్ బృందం 'ఆమె అతనితో రావడం ఇది కొత్తేమీ కాదంటూ' సెలవిచ్చారు. దాంతో అతను సెలీనాకి 'స్పెషల్' వ్యక్తేమోనన్న సందేహం వెలిబుచ్చుతున్నారు ముంబాయి జనాలు. ఇంతకీ ఆ వ్యక్తి ఎవరన్నది అమ్మడు చెబుతుందో లేదో?!

